కంపుకొడుతున్న రోడ్లు.. చెత్తకుప్పలతో పరిసరాలు


మన్సూరాబాద్ డివిజన్ బొమ్మలగుడి అంజనాద్రి రోడ్డు పక్కన పరిసరాల దుస్థితి

● బొమ్మలగుడి రోడ్డు వెంట కుళ్లిపోయి దుర్వాసన ● ముక్కు మూసుకుని వెళ్లిన హైడ్రా కమిషనర్

హయత్‌నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వారం రోజులపాటు చేపట్టిన 'స్వచ్ఛదనం-పచ్చదనం' తూతూ మంత్రంగా సాగిందనడానికి మన్సూరాబాద్ డివిజన్ బొమ్మలగుడి, అంజనాద్రినగర్ రోడ్డును ఉదాహరణగా చెప్పవచ్చు. వారం రోజులపాటు అధికారుల హంగామా తప్ప క్షేత్రస్థాయిలో నెలల తరబడి పేరుకుపోయిన చెత్త నేటికీ అక్కడే ఉండి ప్రజల ఆరోగ్యాన్ని హరిస్తుంది.

మన్సూరాబాద్ డివిజన్‌లోని హయత్‌నగర్ బొమ్మలగుడి-అంజనాద్రినగర్ రోడ్డులో చెత్త పేరుకుపోయింది. ఇక్కడి నుంచి వెలువడే దుర్గంధ వాసన భరించలేక హైడ్రా కమిషనర్ రంగనాథ్ ముక్కు మూసుకుని మంగళవారం హత్తిగూడ చెరువును సందర్శించారు. తెల్లవారుజాము నుంచే రోజుకు వేల మంది ప్రజలు తిరిగే రోడ్డు అపరిశుభ్రతకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. హయత్‌నగర్ నుంచి తట్టిఅన్నారం, నాగోల్‌కు వెళ్లే వాహనదారులు, రావి నారాయణరెడ్డికాలనీ, పాపయ్యగూడకాలనీ, అంజనాద్రినగర్‌కాలనీతో పాటు దాదాపు మరో 10 కాలనీల ప్రజలు సంచరించే రోడ్డు పక్కన పరిసరాలు చెత్త కుప్పలతో నిండి భరించలేని కంపు కొడుతున్నాయి. అక్కడి పరిస్థితి చూస్తే అసలు శానిటేషన్ సిబ్బంది పనిచేస్తున్నారా? అనే అనుమానం కలుగుతోంది. మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ బొమ్మలగుడి నుంచి తట్టిఅన్నారం చౌరస్తాకు వెళ్లే రోడ్డు దుర్గంధ భరితంగా మారింది. హత్తిగూడ చెరువు వద్ద రోడ్డు వెంట చెత్తకుప్పలు పేరుకుపోయాయి. కొంత మంది ప్లాస్టిక్ కవర్లలో చెత్తను తీసుకువచ్చి పారేస్తున్నారు.

స్థానికంగా ఉండే చికెన్, మటన్ సెంటర్ల నిర్వాహకులు మాంసం వ్యర్థాలను కూడా కవర్లలో పెట్టి ఇక్కడే వేస్తున్నారు. వ్యాపారులు సైతం చెత్తను తీసుకువచ్చి రోడ్డు పక్కనే పారబోస్తున్నారు. దీంతో చెత్త పేరుకుపోయింది. మాంసం వ్యర్థాల కవర్లను కుక్కలు తీసుకువచ్చి రోడ్డు మీద వేస్తున్నాయి. కుళ్లిన పదార్థాలతో పరిసరాలు కలుషితం అవుతున్నాయి. ప్రజలు, వాహనదారులు ఈ రోడ్డు పక్క నుంచి వెళ్లాలంటేనే ఇబ్బంది పడుతున్నారు. చెరువులో కొందరు బహిరంగ మల, మూత్ర విసర్జన చేస్తున్నారు. దుర్గంధ వాసనతో ఉదయం వేళ వాకర్స్ తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. శివారులో ఉన్న ఈ ప్రాంతాలను పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


ట్రైసైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

దివ్యాంగులు ఎంచుకున్న రంగంలో రాణించాలి

● మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

వనస్థలిపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని అణగారిన వర్గాల శ్రేయస్సుకు తన వంతుగా కృషి చేస్తున్నట్లు మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి తెలిపారు. మీర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని జిల్లెలగూడ గ్రామానికి చెందిన విష్ణువర్ధన్, జంగయ్యకు మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ట్రై సైకిళ్లను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగులు మనో ధైర్యం కోల్పోకుండా ఎంచుకున్న రంగంలో రాణించాలని సూచించారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మీర్‌పేట్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ అక్కల భూపాల్ రెడ్డి, బీఆర్ఎస్ మీర్‌పేట్ అధ్యక్షుడు అక్కల కామేష్‌రెడ్డి, దీప్‌లాల్‌చౌహాన్, సిద్దాల పద్మ, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.


ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల

ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల విజ్ఞప్తి చేశారు. మంగళవారం చావునీ డివిజన్‌లోని చంచల్‌గూడ గుడ్డిబౌలిలో ఉచిత వైద్యశిబిరాన్ని కార్పొరేటర్ సలాం షాహిద్ మూస్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ బీర్జీస్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

వనస్థలిపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిని కార్పొరేటర్ లచ్చిరెడ్డి సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఆసుపత్రి సిబ్బంది రోగుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు పలు ఆరోపణలు వస్తున్నట్లు తెలిపారు. రోగుల పట్ల దురుసుగా వ్యవహరించిన, నిర్లక్ష్యంగా సమాధానం చెప్పిన సహించేది లేదనీ హెచ్చరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ కృష్ణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వేణుస్వామికి మహిళా కమిషన్ నోటీసులు

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 22న స్వయంగా మహిళా కమిషన్ ఎదుట హాజరు కావాలని వేణుస్వామికి తెలంగాణ మహిళా కమిషన్ మంగళవారం నోటీసులు జారీ చేసింది. ఇటీవల సినీనటుడు అక్కినేని నాగచైతన్య, శోభిత ధూళిపాళలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన వేణుస్వామిపై చర్యలు తీసుకోవాలని సోమవారం తెలుగు ఫిల్మ్ జర్నలిస్టుల అసోసియేషన్, తెలుగు ఫిల్మ్ డిజిటల్ మీడియా అసోసియేషన్ సంయుక్తంగా తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ కార్యాలయంలో చైర్‌పర్సన్ నేరెళ్ల శారదకు ఫిర్యాదు చేశారు. స్పందించిన చైర్‌పర్సన్ వేణుస్వామికి మంగళవారం నోటీసులు జారీ చేశారు.

నేడు ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్‌మేళా

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత కోసం జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ అర్హత కలిగి ఆసక్తి ఉన్న నిరుద్యోగులు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో బుధవారం ఉదయం 10.30 గంటలకు జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో జరిగే జాబ్‌మేళాకు హాజరు కావాలని పేర్కొన్నారు. జె గ్రూప్ కంపెనీలో ఉద్యోగాల కోసం నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళాలో ఎంపికైన వారికి నెలకు రూ.15 వేల వేతనం ఉంటుందని, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇద్దరు గుర్తుతెలియని యాచకులు మృతి

కొత్తపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు గుర్తుతెలియని యాచకులు మృతిచెందారు. ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధి చింతలకుంట-సాగర్‌రింగ్‌రోడ్డు పెట్రోల్ బంక్ సమీపంలో గుర్తు తెలియని యాచకుడి మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం అందింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. కొన్నిరోజుల నుంచి అతడు చింతలకుంట పరిసరాల్లో బిక్షాటన చేస్తూ, ఫుట్‌పాత్‌పై నిద్రించేవాడని, అనారోగ్యంతో మృతిచెంది ఉండవచ్చని పోలీసులు తెలిపారు.


ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో మృతిచెందిన యాచకుడు

సాయినగర్‌కాలనీ సమీపంలో..


సాయినగర్‌కాలనీ సమీపంలో మృతిచెందిన యాచకుడు

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ నుంచి కవాడిపల్లి వెళ్లే రోడ్డులోని సాయినగర్‌కాలనీ సమీపంలో సుమారు 50 నుంచి 60 ఏళ్ల వయస్సు ఉన్న గుర్తుతెలియని యాచకుడు మృతిచెందాడు. అటు వైపు వెళ్తున్న హాస్టల్ విద్యార్థులు మృతదేహాన్ని గమనించి అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్ఆర్ఎల్‌కాలనీ ప్రధాన రహదారిలో కూలిన మ్యాన్‌హోల్


జలమండలి అధికారికి సమస్యను వివరిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్


మ్యాన్‌హోల్ వద్ద మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

కొత్తపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ ఎస్ఆర్ఎల్ కాలనీ ప్రధాన రహదారిలో మంగళవారం చాలా ఏళ్ల క్రితం నిర్మించిన మ్యాన్‌హోల్ కూలింది. ప్రమాదకరంగా పెద్ద గుంత ఏర్పడింది. కార్పొరేటర్ పవన్ కుమార్ ఆ ప్రాంతానికి చేరుకుని జలమండలి అధికారులకు సమాచారం ఇచ్చారు. జలమండలి సీజీఎం నాగేందర్, డీజీఎం రవీంద్రనాథ్, మేనేజర్ స్రవంతీరెడ్డి మ్యాన్‌హోల్ వద్దకు చేరుకుని సమస్యను పరిశీలించారు. వెంటనే ఎక్స్‌కవేటర్‌తో మరమ్మతు పనులు చేయించారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన మ్యాన్‌హోళ్ల మరమ్మతులు చేపట్టాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ జలమండలి అధికారులకు విన్నవించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే సహించేది లేదు

● హైడ్రా కమీషనర్ ఏవీ రంగనాథ్


బతుకమ్మకుంట వద్ద వివరాలు తెలుసుకుంటున్న రంగనాథ్

వనస్థలిపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): చెరువులు, కుంటలు, కాల్వలు కబ్జాచేసి నిర్మాణాలు చేపడితే సహించేది లేదనీ హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరించారు. మంగళవారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఆంధ్రకేసరినగర్‌లోని బతుకమ్మకుంట వద్ద అక్రమ నిర్మాణాలను పరిశీలించిన అనంతరం ఆఫీసర్స్ కాలనీలో కమిషనర్ పర్యటించారు. అక్రమ నిర్మాణాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆఫీసర్స్ కాలనీలో ఉన్న వివాదాస్పద స్థలాన్ని పరిశీలించారు. ఈ స్థలం కాలనీకి చెందినదని కాలనీవాసులు తనకు ఫిర్యాదు చేశారన్నారు. ఈ స్థలంలో ఇంటి నిర్మాణాలకు ఏవిధంగా అనుమతులు ఇచ్చారు, అందుకు సంబందించిన అనుమతుల వివరాలను టౌన్‌ప్లానింగ్ అధికారి మన్సూర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇదే విషయంపై పూర్తి వివరాలు తనకు అందించాలని సంబంధిత అధికారులకు రంగనాథ్ సూచించారు. ఒకవేళ ఈ స్థలం ప్రభుత్వానిదేనని తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు బాలాజీనాథ్, కాలనీవాసులు, అధికారులు పాల్గొన్నారు.

అవయవాలు లభించక ప్రాణాలు పోతున్నాయి

● యశోద ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అవసరమైన అవయవాలు లభించక దేశవ్యాప్తంగా మూడు లక్షల మందికిపైగా మరణిస్తున్నారని అందుబాటులో ఉన్న గణాంకాలు చెబుతున్నాయని యశోద ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి పేర్కొన్నారు. అంతర్జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా మంగళవారం సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన 'సెలబ్రేటింగ్ సెకండ్ చాన్స్ సే' కార్యక్రమంలో గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ, లివర్ మార్పిడి చేసుకుని పునర్జన్మ పొందిన రోగులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. డాక్టర్ పవన్ గోరుకంటి మాట్లాడుతూ రాష్ట్రానికి చెందిన 'జీవన్ దాన్'కు దేశంలో క్రియాశీల కార్యక్రమాల్లో ఒకటిగా గుర్తింపు లభించిందని, రాష్ట్రంలో అవయవదానాల సంఖ్య క్రమంగా పెరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే అవయవదానాల ద్వారా ప్రజల ఆయుష్షును పెంచే రాష్ట్రంగా దేశంలోనే తెలంగాణ అగ్రస్థానానికి చేరుకున్నదన్నారు. అవయవమార్పిడి సర్జరీల నిర్వహణ కేంద్రంగా హైదరాబాద్ దేశంలోనే ప్రధాన నగరంగా మారిందన్నారు. సికింద్రాబాద్ యూనిట్ హెడ్, డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ సెలబ్రేటింగ్ సెకండ్ చాన్స్ కార్యక్రమం గొప్పదని పేర్కొన్నారు.


'సెలబ్రేటింగ్ సెకండ్ చాన్స్ సే' కార్యక్రమంలో వైద్యులు, పేషంట్లు


వినయ్‌నగర్‌లో ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మంజులారెడ్డి


జాతీయ పతాకం ఆవిష్కరణలో కాసం వెంకటేశ్వర్లు, సురేందర్‌రెడ్డి, కార్పొరేటర్ జంగం శ్వేత తదితరులు

ప్రతీ ఇంటిపై జాతీయజెండాను ఎగురవేయాలి

సైదాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం వేళ ప్రతీ ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తి చాటాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఐఎస్‌సదన్ చౌరస్తాలో కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి ఆధ్వర్యంలో త్రివర్ణపతాకాన్ని ఆవిష్కరించారు. జనగణమన ఆలపించారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, మాజీ కార్పొరేటర్ సహదేవ్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ బండ వెంకటోరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా మోర్చా ఆధ్వర్యంలో ర్యాలీ

భాగ్యనగర్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మంజులారెడ్డి ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ నిర్వహించారు. వినయ్‌నగర్ విజయవినాయక ఆలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ సైదాబాద్ మీదుగా మూసారాంబాగ్ వరకు కొనసాగింది. ర్యాలీలో కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి, దశరథ, లక్ష్మి, రేణుకముదిరాజ్, తులసి, రమాదేవి, పార్వతి, సంధ్య, నీరజ, జమున, సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

భూకంప ప్రమాద అధ్యయనానికి ఒప్పందం

ఉప్పల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): హిమాలయా శ్రేణులలో భూకంపానికి కారణమయ్యే వివర్తనిక వికృతిపై విస్తృతమైన అధ్యయనం చేసేందుకు జాతీయ భూభౌతిక పరిశోధనా సంస్థ(సీఎస్ఐఆర్), భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థకి చెందిన జాతీయ రిమోట్ సెన్సింగ్ కేంద్రం (ఎన్ఆర్ఎస్‌సీ) అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ మేరకు మంగళవారం సీఐఎస్ఐఆర్-ఎన్జీఆర్ఐ సంచాలకులు డా. ప్రకాష్‌కుమార్, జాతీయ రిమోట్ సెన్సింగ్ కేంద్రం ఉప సంచాలకులు డా.కె.శ్రీనివాస్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ రెండు సంస్థల మధ్య ఒప్పందం మూడు సంవత్సరాల పాటు కొనసాగనుందని అధికారులు తెలిపారు. భూకంప ప్రమాద మూల్యాంకనం కోసం పశ్చిమ హిమాలయాల్లో భూపటల విరూపణం యొక్క అధిక - రిజల్యూషన్ చిత్రాలను గణించడానికి నిరంతర జీపీఎస్ పరిశీలనలు, ఉపగ్రహ ఆధారిత పరిశీలనల ద్వారా భూమిలో కొలిచే భూపటల విరూపణంపై సమాచారాన్ని ఉపయోగిస్తాయి.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు నిరసన



దిల్‌సుఖ్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఎటీఎఫ్ ప్రతినిధులు

దిల్‌సుఖ్‌నగర్/ఓల్డ్‌మలక్‌పేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించి, వారిగా అండగా నిలవాలని యాంటి టెర్రరిజం ఫోరమ్(ఎటీఎఫ్) చైర్మన్ డాక్టర్ రావి నూతల శశిధర్ అన్నారు. హిందువులపై హింస, హత్యలను ఖండిస్తూ ఎటీఎఫ్ కన్వీనర్ బ్రహ్మచారి ఆధ్వర్యంలో మంగళవారం దిల్‌సుఖ్‌నగర్‌లో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, ఎటీఎఫ్ ప్రతినిధులు నవీన్, పవన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఓల్డ్ మలక్‌పేటలో బీజేపీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకుడు మాధవీలత మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత బంగ్లా ప్రస్తుత పాలకులపై ఉందన్నారు. ర్యాలీలో బీజేపీ నాయకులు చౌకి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.


ఓల్డ్‌మలక్‌పేట ర్యాలీలో మాధవీలత, తదితరులు

అపార్ట్‌మెంట్‌లకు ఒకేచోట డస్ట్ బిన్ ఉండాలి

● గ్రేటర్ కమిషనర్ ఆమ్రపాలి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్‌లో డోర్ టూ డోర్ తిరగకుండా ఒకేచోట డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేస్తే చెత్త సేకరణ సులభతరమవుతుందని, అందుకోసం అపార్ట్‌మెంట్ అసోసియేషన్లను సంప్రదించి బిన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కమిషనర్ ఆమ్రపాలి అడిషనల్, జోనల్ కమిషనర్లలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అపార్ట్‌మెంట్‌లలో చెత్త సేకరణ వివిధ కారణాలతో పూర్తి స్థాయిలో స్వచ్ఛ ఆటోలకు రావడం లేదని, డస్ట్‌బిన్ ఏర్పాటు చేయడం వల్ల చెత్తను స్వచ్ఛ ఆటోలో తీసుకునేందుకు సులభతరమవుతుందని అన్నారు. పార్కుల వద్ద పరిశుభ్రంగా ఉండేలా డస్ట్‌బిన్లు ఉండాలన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద చెత్త వేయకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్ల వివరాల నివేదిక అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జంక్షన్ల వద్ద వాహనదారులకు ఆహ్లాదకరంగా ఉండే విధంగా పూల మొక్కలు ఏర్పాటు చేయాలని యూబీడీ అధికారులకు సూచించారు. పశువులు రోడ్లపై సంచరించకుండా క్షేత్ర స్థాయి అధికారులు తగు చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఎన్ఎండీసీ డైరెక్టర్‌గా జాయ్‌దీప్ దాస్ గుప్తా !


జాయ్‌దీప్ దాస్ గుప్తా

హైదరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ(ఎన్ఎండీసీ) ప్రొడక్షన్ డైరెక్టర్‌గా జాయ్‌దీప్ దాస్ గుప్తా పేరును పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలెక్షన్ బోర్డు సిఫారసు చేసింది. జాయ్‌దీప్ దాస్ గుప్తా స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్నారు. అయితే, న్యూఢిల్లీలో మంగళవారం జరిగిన పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలెక్షన్ బోర్డు సమావేశంలో జాయ్‌దీప్ నియామకంపై చర్చించారు. అలాగే, ఎన్ఎండీసీ చైర్మన్ అమితవ్ ముఖర్జీపై లోక్‌పాల్ లో జరుగుతున్న విచారణపైనా బోర్డు చర్చించింది. అమితవ్ ముఖర్జీపై చేసిన ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను సమర్పించేందుకు ఫిర్యాదుదారుడికి బోర్డు రెండు వారాలు గడువిచ్చింది.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

'విద్యాశాఖలో ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధ్యం కాదు'

పంజాగుట్ట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధ్యం కాదని, డిప్యూటీ ఈఓ, ఎంఈఓ, డైట్ లెక్చరర్, జూనియర్ కాలేజీ లెక్చరర్ తదితర పోస్టులను పదోన్నతి ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఇవ్వడం లేదని ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాసం ప్రభాకర్ అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సంఘం అసోసియేట్ అధ్యక్షుడు టి.ప్రకాష్‌గౌడ్, ఉపాధ్యక్షుడు ఎండీ కలీల్ అహ్మద్, తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. మూడు దశాబ్దాలుగా విద్యాశాఖలో పనిచేస్తున్న సుమారు 12 వేల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు రావాల్సిన పదోన్నతులు రాలేదన్నారు. గత ప్రభుత్వాలు ఉమ్మడి సర్వీస్ రూల్స్ పేరుతో జీవోలు తెచ్చి ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కలిపి ఇవ్వడంతో తమకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఆ జీవోలపై తాము రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా ఉమ్మడి సర్వీస్ రూల్స్ చెల్లదని తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని తెలిపారు. అన్ని మండలాలకు ప్రభుత్వ ఉపాధ్యాయులకే పదోన్నతులు కల్పించి ఎంఈఓలుగా నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం నాయకులు వై.కృష్ణారావు, పోశం కృష్ణమూర్తి, శ్రావణ్ కుమార్, సైదులురెడ్డి, సంపత్ కుమార్, గంగాధర్ పాల్గొన్నారు.

వీహెచ్‌పీ రాష్ట్ర ప్రచార సహ ప్రముఖ్‌గా అనిల్


అనిల్

సైదాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వీహెచ్‌పీ రాష్ట్ర ప్రచార సహ ప్రముఖ్(రాష్ట్ర అధికార ప్రతినిధి)గా కుర్మగూడ డివిజన్‌కు చెందిన రేగు అనిల్ నియమితులయ్యారు. కామారెడ్డిలోని సరస్వతీ శిశుమందిర్‌లో నిర్వహించిన వీహెచ్‌పీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో అనిల్‌ను నియమించినట్లు రాష్ట్ర ప్రచార ప్రసార ప్రముఖ్ బాలస్వామి పేర్కొన్నారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ వీహెచ్‌పీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ఎంజీబీఎస్‌లో ఆకస్మిక తనిఖీలు


ప్రయాణికుల బ్యాగ్‌లను తనిఖీ చేస్తున్న ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి, అదనపు డీసీపీ నర్సయ్య తదితరులు

చాదర్‌ఘాట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో పోలీసులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి ఆధ్వర్యంలో బస్టాండ్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ కార్యాలయం, పార్శిల్, బుకింగ్ కార్యాలయం, వెయిటింగ్ హాల్, ప్లాట్ ఫాంలతో పాటు ప్రయాణికుల బ్యాగ్‌లను డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేశారు. అనుమానాస్పదంగా కనిపించిన పలువురు ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తనిఖీల్లో సౌత్ జోన్ అదనపు డీసీపీ నర్సయ్య, సిబ్బంది పాల్గొన్నారు.


కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న టీవీ రియాల్టీ షో బిగ్‌బాస్-7 విన్నర్ పల్లవి ప్రశాంత్ - చంపాపేట, ఆంధ్రజ్యోతి


విజయపురికాలనీలో ఫలహారం బండి ఊరేగింపును ప్రారంభిస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ దేప సురేఖ దంపతులు


కర్మన్‌ఘాట్‌లో నిర్వహించిన పోచమ్మతల్లి ఘటాలు, ఫలహారబండి ఊరేగింపులో కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి, తదితరులు


మలక్‌పేట ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన పిడమర్తి నరేష్‌ను సన్మానిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు వంజరి వినోద్‌కుమార్, గ్రేటర్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సీహెచ్ సురేష్, మలక్‌పేట పవర్ టిల్లర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రాంరెడ్డి తదితరులు - చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి